## ఎన్టీఆర్-నీల్ సినిమా వచ్చేది ఆరోజే!



ఎన్టీఆర్ కథానాయకుడిగా 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా సినిమా రిలీజ్ డేట్‌ను ఖరారైంది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది జూన్ 25న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఇటీవలే ఈ సినిమా తాలూకు కీలక షెడ్యూల్ మంగళూరులో మొదలైంది. ఇందులో ఎన్టీఆర్ పాల్గొంటున్నారు. హై ఇంటెన్సిటీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో ఎన్టీఆర్ మునుపెన్నడూ చూడని విధంగా సరికొత్త మాస్ అవతారంలో కనిపిస్తారని చిత్రబృందం పేర్కొంది. 'ఎన్టీఆర్‌నీల్' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందిస్తున్న ఈ చిత్రం నిర్మాణ దశ నుంచే అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నది. దర్శకుడు ప్రశాంత్‌నీల్ తనదైన శైలిలో రోమాంచిత పోరాట ఘట్టాలు, గ్రాండియర్ మేకింగ్‌తో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నాడని, సిల్వర్‌స్క్రీన్‌పై సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: భువన్‌గౌడ, సంగీతం: రవి బస్రూర్, నిర్మాతలు: కల్యాణ్‌రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు, నిర్మాణ సంస్థ: మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్, రచన-దర్శకత్వం: ప్రశాంత్‌నీల్.

## అవమానం నన్నెంతో బాధించింది



మృణాల్ ఠాకూర్ మనసు గాయపడింది. ఈ గాయానికి మీడియా వాళ్లే కారణమట. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన బాధను వ్యక్తం చేసింది మృణాల్ ఠాకూర్. 'రీసెంట్‌గా ఓ అవార్డు వేడుకకు నేనూ జాన్వీ కపూర్ హాజరయ్యాం. ముందుగా నేను ఆ వేడుకలోకి అడుగుపెట్టా. నన్ను చూడగానే మీడియా వాళ్లంతా చుట్టుముట్టారు. ఊపి రాడనీయకుండా ప్రశ్నలు సంధించారు. అన్నింటికీ ఓపిగ్గా సమాధానాలిస్తున్నా. ఇంతలో జాన్వీ లొకేషన్‌లోకి ఎంటరయ్యింది. అంతే.. నన్ను వదిలేసి అంతా జాన్వీ దగ్గరకు పరిగెత్తారు. ఊహించని ఆ సంఘటన నా మనసుని ఎంతో బాధించింది. అవమానంగా ఫీలయ్యా. పరిశ్రమలో వారసత్వానికి ఉన్న ప్రాధాన్యత నాలా కష్టపడి పైకొచ్చిన వాళ్లకు ఉండదు. జాన్వీలా నేను స్టార్‌కిడ్‌ని కాదు కదా.' అంటూ ఆవేదన వ్యక్తం చేసింది మృణాల్ ఠాకూర్.

## ఇద్దరు బన్నీలు.. ముగ్గురు హీరోయిన్లు?



'పుష్ప2' తర్వాత అల్లు అర్జున్ స్థాయి ఆకాశమంత ఎత్తుకు చేరుకుంది. ఆయన సినిమా బడ్జెట్ కూడా వందలకోట్లకు చేరింది. ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో బన్నీ నటించనున్న సినిమాకు బడ్జెట్ 600కోట్ల పై మాటేనట. సైన్స్ ఫిక్షన్ నేపథ్య కథాంశంతో తెరకెక్కనున్న ఈ చిత్రంలో విజువల్ ఎఫెక్ట్స్‌కి పెద్ద పీట వేయనున్నారు. ఇందులో భాగంగానే అంతర్జాతీయ గ్రాఫిక్స్ కంపెనీలు ఈ సినిమాకోసం పనిచేస్తున్నాయి. కథ ప్రకారం బన్నీ ఇందులో ద్విపాత్రాభినయం చేస్తున్నట్టు తెలుస్తున్నది. అదే నిజమైతే అల్లు అర్జున్ అభిమానులకు కన్నుల పండుగే. ఇదిలావుంటే ఈ సినిమాలో ముగ్గురు కథానాయికలకు స్థానం ఉన్నదట. ఇప్పటికే ఓ కథానాయికగా జాన్వీకపూర్ పేరు బలంగా వినిపిస్తున్నది. మరో కథానాయికగా మృణాల్ ఠాకూర్‌ని తీసుకున్నారని వినికిడి. మృణాల్ కూడా ఈ విషయాన్ని చూచాయగా ఇటీవల ధృవీకరించింది. ఇప్పుడు మూడో హీరోయిన్‌గా అనన్య పాండే పేరు వినిపిస్తుంది. నిజంగా ఈ ముగ్గురూ కథానాయికలైతే.. సినిమా కలర్‌ఫుల్‌గా ఉంటుందని ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ఈ పానిండియా సినిమాను సన్ పిక్చర్స్ సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

## వరుణ్‌తేజ్ ప్రేమకథ?



హీరో వరుణ్‌తేజ్ ఈ మధ్య వరుసగా యాక్షన్ సినిమాలు చేస్తున్నారు. 2018లో వచ్చిన 'తొలిప్రేమ' తర్వాత ఆయన్నుంచి పూర్తిస్థాయి ప్రేమకథ రాలేదు. రీసెంట్‌గా 'రాధేశ్యామ్' దర్శకుడు రాధాకృష్ణ ఓ డీసెంట్ ప్రేమకథను వరుణ్‌కు వినిపించారట. ఇదో క్లాసికల్ లవ్‌స్టోరీ అని సమాచారం. ప్రాజెక్ట్ దాదాపు ఖరారైనట్టేనని తెలుస్తున్నది. ఈ సినిమా నిర్మించేదెవరు? షూటింగ్ మొదలయ్యేదెప్పుడు? అనే ప్రశ్నలకు త్వరలోనే సమాధానాలు రానున్నాయి. ప్రస్తుతం వరుణ్‌తేజ్ 'కొరియన్ కనకరాజు' అనే సినిమా చేస్తున్నారు. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్నది. ఆచార్య సెట్లో ఓ ఐటమ్ సాంగ్‌ని మేకర్స్ తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా పూర్తయిన వెంటనే రాధాకృష్ణ కథను వరుణ్ పట్టాలెక్కిస్తారని సమాచారం.

## అఖండ- 2లో సన్నీ భాయ్



గదర్ 2, జాట్ చిత్రాలతో వరుస విజయాలను నమోదు చేశారు బాలీవుడ్ స్టార్ హీరో సన్నీడియోల్. ప్రస్తుతం ఆయన గురించి ఓ ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో హల్‌చల్ చేస్తున్నది. బాలకృష్ణ 'అఖండ 2'లో ఆయన ఓ ప్రత్యేక ఆకర్షణగా మెరవనున్నారట. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన ఓ కీలకమైన షెడ్యూల్‌ని జార్జియాలో ప్లాన్ చేశారు దర్శకుడు బోయపాటి శ్రీను. ఈ షెడ్యూల్‌లోనే సన్నీడియోల్ జాయిన్ అవుతారని సమాచారం. సెకండ్ హాఫ్‌లో ఈ పాత్ర ఎంట్రీ ఉంటుందని, ఈ పాత్ర ద్వారా క్లైమాక్స్‌లో ఓ భారీ ట్విస్ట్ రివీల్ అవుతుందని తెలుస్తుంది. ఈ ట్విస్ట్ 'అఖండ 3'కి లీడ్ అవుతుందట. ఈ వార్తలో వాస్తవం ఎంతుందో తెలీదుకానీ బాలయ్య అభిమానుల్లో మాత్రం ఈ వార్త మంచి కిక్‌ను నింపుతున్నది. 14రీల్స్ పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆది పినిశెట్టి, సంయుక్త మీనన్ ఓ కీలక పాత్రల్లో పోషిస్తున్న విషయం తెలిసిందే.

## సీరియల్ కిల్లర్ ఎవరు?



నవీన్‌చంద్ర కథానాయకుడిగా నటిస్తున్న ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'లెవెన్'. లోకేష్ అజ్ల్స్ దర్శకుడు. ఈ సినిమా తెలుగు థియేట్రికల్ హక్కులను రుచిర ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎన్.సుధాకర్ రెడ్డి సొంతం చేసుకున్నారు. మే 16న ప్రేక్షకుల ముందుకురానుంది. అగ్ర నటుడు కమల్‌హాసన్ ట్రైలర్‌ను విడుదల చేశారు. వైజాగ్‌లో జరిగే వరుస హత్యలను పరిశోధించే పోలీసాఫీసర్‌గా నవీన్‌చంద్ర పవర్‌ఫుల్ పాత్రలో కనిపించారు. సైకో కిల్లర్‌ను పట్టుకునే క్రమంలో చోటుచేసుకునే సంఘటనలు ఉత్కంఠను పంచుతాయని మేకర్స్ తెలిపారు. రేయా హరి, అభిరామి, రవివర్మ, కిరీటి దామరాజు తదితరులు నటించిన ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కార్తీక్ అశోకన్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: డి.ఇమ్మాన్, దర్శకత్వం: లోకేష్ అజ్ల్స్.



## నేనలా మాట్లాడి ఉండాల్సింది కాదు

నటి ప్రీతి జింటా అభిమానికి క్షమాపణలు చెప్పారు. ఓ అభిమాని ప్రశ్నకు ఆమె స్పందించిన తీరు పలు విమర్శలకు దారి తీసింది. దాంతో ఆమె క్షమాపణ చెప్పక తప్పలేదు. వివరాల్లోకెళ్తే.. సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే ప్రీతి.. ఎక్స్ వేదికగా ఇటీవల అభిమానులతో ఇంటరాక్ట్ అయ్యారు. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఈ క్రమంలో ఓ అభిమాని.. 'హిందుత్వంపై మీ అభిమానం చూస్తుంటే మీరు భాజపాలో చేరతారేమో అనిపిస్తుంది? రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన ఉందా? అనడిగాడు. ఈ ప్రశ్న వినగానే ప్రీతి జింటా అసహనానికి లోనయ్యారు. కాస్త కఠినంగానే జవాబిచ్చారు. 'దేవాలయాలకూ, కుంభమేళాలకు వెళ్తే భాజాపాలో చేరినట్టేనా? అంటే నా సంస్కృతినీ నా ధర్మాన్ని గౌరవించడం కూడా నేరమేనా? ఈ సోషల్ మీడియాతో వచ్చే ఇబ్బంది ఇదే. ప్రతి ఒక్కరూ ఇక్కడ జడ్జ్ చేసేవారే.' అంటూ ఘాటు స్పందించారు ప్రీతి జింటా. అయితే.. నెట్టింట ఆమె ప్రవర్తించిన తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. చిన్న ప్రశ్నకు ఇంత కఠినంగా జవాబివ్వాలా? అంటూ కొందరు ఎదురు ప్రశ్నించారు. దాంతో సదరు అభిమానికి ప్రీతి క్షమాపణలు చెప్పక తప్పలేదు. 'క్షమించండి.. నేనలా మాట్లాడి ఉండాల్సింది కాదు. ప్రస్తుతం విదేశాల్లో ఉంటున్నా. నా పిల్లలు భారతీయతనూ, మన సంప్రదాయాన్నీ, ధర్మాన్నీ మరచిపోకూడదనే తరచూ వాళ్లను దేవాలయాలకు తీసుకెళ్తుంటా. దురదృష్టవశత్తూ దాన్ని కూడా వేరేలా అర్థం చేసుకుంటున్నారు. రాజకీయం చేస్తున్నారు. అందుకే అలా మాట్లాడా.' అంటూ వివరణ ఇచ్చారు ప్రీతి జింటా.

## మైథాలజీ పాయింట్‌తో 'దీక్ష'



కిరణ్, అలేఖ్యారెడ్డి జంటగా నటిస్తున్న చిత్రం 'దీక్ష'. స్వీయ దర్శకనిర్మాణంలో ప్రతాని రామకృష్ణగౌడ్ రూపొందిస్తున్నారు. షూటింగ్ పూర్తయింది. ఈ సందర్భంగా ప్రతాని రామకృష్ణగౌడ్ చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఒక వ్యక్తి దీక్ష, పట్టుదలతో పనిచేస్తే ఏదైనా సాధించవొచ్చనే స్ఫూర్తివంతమైన పాయింట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. లవ్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా మెప్పిస్తుంది. కథలోని మైథాలజికల్ పాయింట్ ఆసక్తికరంగా ఉంటుంది. కథానుగుణంగా సంగీత దర్శకుడు రాజ్‌కిరణ్ ఐదు చక్కటి పాటలిచ్చారు. మే నెలలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. ఈ సినిమాలో తాను ప్రత్యేకగీతంలో నర్తించానని ఆక్సఖాన్ తెలిపింది. ఆర్.కె.ఫిల్మ్స్, సిద్ధ క్రియేషన్స్ పతాకాలపై ఆర్.కె.గౌడ్, పి.అశోక్‌కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

## మలయాళ దర్శకుడు షాజీ కరుణ్ కన్నుమూత



ప్రముఖ మలయాళ దర్శకుడు, సినిమాటోగ్రాఫర్ షాజీ కరుణ్ (73) సోమవారం కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆయన క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. 'పిరవి' (1988) చిత్రంతో ఆయన దర్శకుడిగా పరిచయమయ్యారు. ఈ సినిమా పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శింపబడి ప్రశంసలందుకుంది. స్వాహం, వానప్రస్థం, నిషాద్, స్వపానమ్, వూలు, కుట్టి శ్రాంక్, వంటి చిత్రాలు దర్శకుడిగా ఆయనకు మంచి గుర్తింపును తెచ్చిపెట్టాయి. 'వానప్రస్థం' చిత్రం మూడు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ఇందులో నటించిన మోహన్‌లాల్ ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డును అందుకున్నారు. మమ్ముట్టితో ఆయన తీసిన 'కుట్టి శ్రాంక్' సైతం ఉత్తమ చిత్రంగా నేషనల్ అవార్డు గెలుచుకుంది. షాజీ కరుణ్‌ను భారత ప్రభుత్వం 2011లో పద్మశ్రీతో సత్కరించింది. ఆయన మృతిపట్ల పలువురు దక్షిణాది సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.





